చెరువులు, వాగులపై కన్ను

- వ్యర్థాలతో నింపి ఆపై ఆక్రమణలు
- కుంచించుకుపోతున్న చెరువులు, వాగులు
- వరద ప్రవాహం దిశ మార్చుకొని గ్రామాలకు పొంచి ఉన్న ముంపు ప్రమాదం

జి.కొండూరు: రహదారుల మార్జిన్లలో ఉన్న వాగులు, చెరువులపై ఆక్రమణదారుల కన్ను పడింది. పాత భవనాలు కూల్చినప్పుడు ముందస్తు వ్యూహంలో భాగంగా వాటి వ్యర్థాలతో రహదారుల మార్జిన్లలో ఉన్న వాగులు, చెరువుల అంచును నింపుతున్నారు. ఇలా ముందుగా అనుకున్నంత స్థలం కోసం వ్యర్థాలను తరలిస్తూ చదును చేస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత అక్రమించిన స్థలాల్లో షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలా కొంతకాలం గడిచిన తర్వాత ఏకంగా శాశ్వత నిర్మాణాలను చేపట్టి అద్దెలకు ఇస్తున్నారు. అక్రమణదారులు చేస్తున్న ఈ దుశ్చర్య వల్ల చెరువులలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. భారీ వర్షాలు పడినప్పుడు వాగులు దిశ మార్చుకొని వరద ప్రవాహం గ్రామాల మీదకు వచ్చి ముంపునకు గురై ప్రజలు నష్టపోతున్నారు.

చిన్న చెరువు అక్రమణకు ప్రయత్నాలు

మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న చిన్న చెరువు కింద 25 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు మైలవరం గ్రామం మధ్యలో ఉండడంతో గ్రామానికి ప్రత్యేక అకర్షణగా ఉంది. ఈ చెరువు 30వ నంబరు జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో అక్రమణ దారుల కన్ను దీనిపై పడింది. రహదారికి, చెరువుకు మధ్యలో మార్జిన్ ఎక్కువ ఉండటంతో గ్రామంలోని వ్యర్థాలను తరలించి ఇక్కడ కుప్పలుగా పోయడంతో పాటు వాటిని చెరువులోకి నెట్టుకుంటూ చదును చేస్తున్నారు. చెరువును కొద్దికొద్దిగా పూడ్చి ఆక్రమణకు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి చెరువు వద్ద శిథిలాలను నింపకుండా చర్యలు చేపట్టకపోతే చెరువు విస్తీర్ణం తగ్గిపోవడంతో పాటు స్థలం అక్రమణకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.




మైలవరం చిన్న చెరువు అంచున భవనాల వ్యర్థాలు : కట్టుబడిపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన తొమ్మండ్రంవాగును పూడ్చి మార్జిన్‌లో నిర్మించిన దుకాణాలు

ఆక్రమణల చెరలో తొమ్మండ్రం వాగు

జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు సరిహద్దుగా కట్టుబడిపాలెం వద్ద ఉన్న తొమ్మండ్రం వాగు ఆక్రమణకు గురవుతోంది. గడ్డమణుగు లోయలోని కొండల్లో సహజ సిద్ధంగా పుట్టిన ఈ వాగు కట్టుబడిపాలెం గ్రామం మీదుగా కవులూరు వరకు ప్రవహించి బుడమేరులో కలుస్తోంది. అయితే ఇటు కట్టుబడిపాలెం, అటు కొండపల్లి ఐడీఏకి సరిహద్దు ప్రాంతంలో ఒక వైపు వాగు, మరో వైపు ఏపీఐఐసీ కేటాయించిన స్థలం 11 ఎకరాలకు పైగా ఉంది. ఇప్పుడు అక్రమార్కులకు ఈ స్థలంపై కన్నుపడింది. పాత భవనాలను తొలగించగా వచ్చిన వ్యర్థాలను ఈ వాగులో నింపుతూ మెరక చేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో 30వ నంబరు జాతీయ రహదారిని ఆనుకొని తొమ్మండ్రం వాగు వైపు కొన్ని దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలకు వెనక భాగానే శిథిలాలను నింపుతూ అక్రమార్కులు వాగును పూడ్చే పనిలో పడ్డారు. ఇదే విధంగా ఆక్రమణలు కొనసాగితే తొమ్మండ్రం వాగు కనుమరుగైపోయి కొండల్లో నుంచి వచ్చే వరద ఉధృతి అటు కొండపల్లి ఐడీఏలోని పరిశ్రమలతో పాటు కట్టుబడిపాలెం గ్రామం, కొండపల్లి శాంతినగర్ వంటి గ్రామాలు పూర్తిగా నీట మునిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి తొమ్మండ్రం వాగు ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దిశ మార్చుకుంటున్న వాగులు

గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు మైలవరం నియోజకవర్గంలో ఆక్రమణ చెరలో ఉన్న కొండ వాగు, బుడమేరు వాగు, తొమ్మండ్రం వాగు, పులి వాగు, కోతలవాగు, కప్పల వాగులు ఉగ్ర రూపాన్ని ప్రదర్శించాయి. భారీగా వచ్చిన వరద ప్రవహించేందుకు మార్గం లేక దిశ మార్చుకుని గ్రామాల మీదకు వచ్చింది. ఈ ఘటనతో నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాలు నీటి మునిగి జనజీవనం స్తంభించి పోయింది. అత్యాశతో వాగులను ఆక్రమించి కాంక్రీటు కట్టడాలను నిర్మించడమే ఈ వరద ప్రవాహానికి కారణమని తెలిసినప్పటికీ ఎటువంటి ప్రక్షాళన జరగలేదు.

ఆక్రమణలను సహించం

చెరువులను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువుల అంచున వ్యర్థాలను నింపి చదును చేయడం వల్ల చెరువుల విస్తీర్ణం తగ్గిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. మైలవరం చిన్న చెరువు వద్ద వ్యర్థాలను పరిశీలించి విచారణ జరుపుతాం. వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపడతాం.

– రాజశేఖర్, ఇరిగేషన్ ఏఈ, మైలవరం

చెరువుల ఆక్రమణ దుర్మార్గం



భవన నిర్మాణ వ్యర్థాలను నింపి చెరువులను ఆక్రమించడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి రైతులు నష్టపోతారు. మైలవరం చిన్న చెరువు గతంలో ఆక్రమణలకు గురైంది. ఇప్పుడు ఏకంగా జాతీయ రహదారి పక్కనే చెరువును వ్యర్థాలతో నింపి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. చెరువులను ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– చాట్ల సుధాకర్, సీపీఎం మండల కార్యదర్శి, మైలవరం

క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



మైలవరం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు, కార్యదర్శి కాజా మహేష్, సంఘ సీనియర్ సభ్యులు గాంధీ, జూలకంటి ప్రసాద్, కల్లూరి కన్నయ్య తదితరుల సౌజన్యంతో 22 మంది పేద ఆర్యవైశ్యులకు నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక రామాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీను, అప్పారావు, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సారె మహోత్సవం



మైలవరం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మైలవరంలోని కోట మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాసం సారె మహోత్సవాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కాళికాదేవి నృత్య ప్రదర్శనతో భక్తులు వీధులలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా యూటీఎఫ్ దినోత్సవం



విస్సన్నపేట: ఉపాధ్యాయుల ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిన యూటీఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ అన్నారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సీహెచ్ చంటిబాబు, ప్రధాన కార్యదర్శి ఎ. మురళీకృష్ణ, నాయకులు పి. రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, వి. రవి, ఈ. నాగేశ్వరరావు, లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చాట్రాయి: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ దేవతకు భక్తులు పూజలు నిర్వహించారు. డప్పులు, వాయిద్యాలతో ఆయా గ్రామాల్లోని ముత్యాలమ్మ ఆలయాలకు కుటుంబ సమేతంగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రైవేట్ ల్యాబ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా లవకుమార్



నూజివీడు: పట్టణానికి చెందిన రమ దయా గ్నస్టిక్స్ అధినేత కంచర్ల లవకుమార్ ఏపీ ప్రైవేట్ ల్యాబ్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో లవకుమార్‌ను ఎన్నుకున్నారు. లవకుమార్ గతంలో కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి: మండలంలోని పర్వతాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.8,750 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

14న శిఖర పునః ప్రతిష్ఠ మహోత్సవం

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని ఉమాదేవి సమేత ఆకేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లో శివ పరివార, ప్రమదగణ, శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 14న ఉదయం 7.28 గంటలకు జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. యంత్ర సహిత విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అన్నప్రసాద వితరణకు విరాళాలు అందజేయు దాతలు సెల్: 96664 67379, 90003 68369 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా కంచి కామాక్షి ఆలయ వార్షికోత్సవం

మైలవరం: మైలవరం పట్టణంలోని కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వరసిద్ధి గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆదిత్యాది నవగ్రహ దేవతలు శ్రీచక్ర మహా యంత్రం చిన్న నాగేంద్ర స్వామి క్షేత్రపాలక కాలభైరవ స్వామి ప్రతిష్ఠాపన చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ పూజలు, అభిషేకాలు, హోమ మండపార్చనలు, మహా బలిహరణ కార్యక్రమం, శాంతి కల్యాణ మహోత్సవం జరిగాయి. అనంతరం మహా నైవేద్యం నీరాజనం, మంత్ర పుష్పాలు, మహా నైవేద్యం వితరణలు జరిగాయి.

17న మధుమేహ ప్రత్యేక వైద్యశిబిరం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 17న తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్య శిబిరం జరుగుతుందని వేదిక పట్టణ కమిటీ తెలిపింది. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లోని నాగార్జున స్కూల్ ఆవరణలో ఉదయం 5 నుంచి 11 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల హక్కుల సాధనకు ఐక్య ఉద్యమం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

మైలవరం: కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమం కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు అన్నారు. రెడ్డిగూడెంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మికుల సమస్యలపై ఆదివారం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, 44 లేబర్ చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులపై కత్తి మోపాయని చెప్పారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేశారని, స్కీమ్ వర్కర్స్‌పై పని భారం బాగా పెరిగిందని, కనీస వేతనం చట్టం అమలు చేసే పరిస్థితి లేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్, సీఐటీయూ మండల అధ్యక్షుడు కొండపల్లి పరమేశ్వరరావు, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు తిరుపతమ్మ, రమేష్, సురేష్, వాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రెడ్డిగూడెం మండల సీఐటీయూ కన్వీనర్‌గా ఎం. తిరుపతమ్మ, కో-కన్వీనర్‌గా కొండపల్లి పరమేశ్వరరావు, కమిటీ సభ్యులుగా టి. నాగరాజు, బి. వెంకటరామయ్య, డి. సురేష్, వరలక్ష్మి, వాణి, లలితకుమారి, ప్రభాకర్ తదితరులు ఎన్నికయ్యారు.

గురుకుల పాఠశాలల్లో జ్వరాలపై సర్వే

మైలవరం: రెడ్డిగూడెం మండలంలోని రంగాపురం, విస్సన్నపేట మండలంలోని నరసాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో జ్వరాలపై సర్వే కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సుహాసినీ పర్యవేక్షణలో స్థానిక వైద్య అధికారుల సహకారంతో ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో జ్వరం కేసుల సమాచారం అందిన వెంటనే స్థానిక వైద్యాధికారుల సహకారంతో తగు చర్యలు తీసుకున్నామని డాక్టర్ సుహాసినీ తెలిపారు. నర్సాపురం గురుకుల పాఠశాలలో గత వారం నుంచి సాధారణ జ్వరాలు 1, 2 కేసులు మాత్రమే గుర్తించబడ్డాయని, రంగాపురం గురుకుల పాఠశాలలో జ్వరం కేసులు నమోదు కాలేదన్నారు. జిల్లా వైద్య విభాగం సహకారంతో ఆరోగ్య పరిరక్షణ చర్యలు అమలు చేస్తున్నామని, రెండు గురుకుల పాఠశాలల్లోనూ ప్రత్యేక ఆరోగ్య పర్యవేక్షకులు అందుబాటులో ఉండి నిరంతర పర్యవేక్షణతో ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తున్నారని చెప్పారు.



విద్యార్థుల వైద్య పరీక్షలు పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

మట్టి తొలగించరూ!

నూజివీడు: పట్టణంలోని పీజీ సెంటర్ రోడ్డు వద్ద డ్రెయినేజీలో మట్టిని తొలగించి రోడ్డుపై పోసి అలాగే వదిలేయడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత నాలుగు రోజుల కిందట ఈ రోడ్డులో సత్యనారాయణ థియేటర్ సమీపంలో డ్రెయినేజీలు పూర్తిగా పూడుకుపోవడంతో అందులోని మట్టిని జేసీబీతో తొలగించి రోడ్డుపై పోశారు. మట్టిని తొలగించకపోవడంతో వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైలవరం, విస్సన్నపేట ప్రాంతాల వైపు నుంచి వచ్చే బస్సులు, కార్లు, ఆటోలు, వ్యాన్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు తదితర వాహనాలన్నీ ఈ మార్గంలోనే వస్తాయి. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు, కళాశాల బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో తప్పుకునేందుకు వీలులేక గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



తొలగించకుండా రోడ్డుపైనే వదిలేసిన మట్టి దిబ్బలు

భూ పోరాట యోధుడు దాసరి

నూజివీడు: రాజ్యసభ మాజీ సభ్యుడు, సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి దివంగత దాసరి నాగభూషణరావు జీవితమంతా పోరాటాలతోనే కొనసాగిందని, ఆయన భూపోరాట యోధుడని సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు అన్నారు. నాగభూషణరావు శత జయంతిని ఆదివారం పట్టణంలోని అమర్ భవన్‌లో నిర్వహించారు. దాసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమ్మన నాగేశ్వరావు మాట్లాడుతూ దాసరి రాజకీయ జీవితం తొలి దశ విద్యార్థి పోరాటాలతోనే ప్రారంభమైందన్నారు. జమీందారీ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో 45 గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల భూమిని పంపిణీ చేసిన భూ పోరాట యోధుడని వివరించారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ సామాజిక న్యాయం కోసం, సమాజంలో పేద దళిత వర్గాలకు తన చివరి శ్వాస వరకు అండగా ఉన్నారన్నారు. తనకున్న యావదాస్తిని పార్టీ నిర్మాణానికి, హైదరాబాద్ సీఆర్ ఫౌండేషన్‌కు, విజయవాడలోని దాసరి భవన్‌కు, నూజివీడులోని పార్టీ ఆఫీసుకు ఇచ్చిన గొప్ప దాతృత్వవాదని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.నరసింహ, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ప్రజా సంఘాల నాయకులు కృష్ణప్రసాద్, కె. కృష్ణ, కె. రామ్మూర్తి, వాకా రాంబాబు, టి. వెంకట్రావు, ఎం.రాంబాబు, పి.ప్రవీణ్, ముత్యాల విజయ్, చలసాని వీరభద్రరావు, ఒగ్గు ముఖర్జీ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



92 మందికి వైద్య పరీక్షలు

జి.కొండూరు: మండల పరిధి కవులూరులో ధన్వంతరీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ట్రస్టు భవనంలో నిర్వహించారు. డాక్టర్ గౌతమ్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ పవన్ పర్యవేక్షణలో 92 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు జరిపి మందులను అందజేశామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా గ్రామ దేవతల జాతరలు

ముసునూరు: గ్రామ పొలిమేర దేవతలకు జాతరలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని లోపూడి శివారు బాసవరప్పాడు, మండల కేంద్రం ముసునూరులలో కొలువై ఉన్న గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గంగానమ్మ చెంతకు ఆయా గ్రామాల పెద్దలు, ఆడపడుచులు, భక్తులు, పిల్లలు గ్రామస్తులంతా తరలి వెళ్లారు. అమ్మవార్ల మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చీర, సారె, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ కోర్కెలు విన్నవించుకున్నారు.

వెలగని వీధి దీపాలు

ఆగిరిపల్లి: స్థానిక కొలిమి బజార్ నుంచి హైస్కూల్ రోడ్డు వరకు గత పది రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చీకట్లో ప్రయాణించాలంటే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని, దీంతో చీకటిలో నడవాలంటే భయంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

వ్యవసాయ సొసైటీలకు కమిటీల నియామకం

ముసునూరు: మండలంలో ఎనిమిది వ్యవసాయ సొసైటీలుండగా తొలి విడతలో రెండు వ్యవసాయ సొసైటీలకు కమిటీలను, మలి విడతలో ఐదు సొసైటీలకు కమిటీలను ప్రకటించారు. ముసునూరు, చెక్కపల్లి, రమణక్కపేట, చింతలవల్లి సొసైటీలకు దేవినేని శ్రీధర్, కాటేపల్లి వెంకట సూర్య ప్రసాద్, రంగు ఆంజనేయులు, బర్మా రమేష్ త్రిసభ్య కమిటీల చైర్మన్లుగా, కొర్లగుంటకు పొట్లూరి అనూరాధ త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారని ప్రకటించారు. కాట్రేనిపాడు సొసైటీకి ప్రకటించాల్సి ఉందని సొసైటీ వర్గాలు పేర్కొన్నాయి.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ 1989–90 సంవత్సర పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒక చోట చేరి చిన్ననాటి స్నేహితులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకుని తరగతి గదుల్లో తిరుగుతూ నాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం సహబంక్తి భోజనాలు చేశారు. రోజంతా ఉల్లాసంగా, ఆనందంగా గడిపారు.

రోడ్డు మార్జిన్‌లోనే చెత్త డంపింగ్



నూజివీడు: పట్టణంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా రోడ్డు వెంటే డంపింగ్ చేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య వర్కర్లు ట్రాక్టర్లలో, ఆటోల్లో తరలించి రామన్నగూడెం రోడ్డులోని డంపింగ్‌యార్డుకు సమీపంలో తారు రోడ్డు వెంట పడేస్తున్నారు. పడేసిన చెత్తను తగులబెడుతున్నారని, దీంతో ఈ ప్రాంతమంతా పొగ ఆవరించడంతో పాటు దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చెత్తను రోడ్డు వెంట వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుండటంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని రామన్నగూడెం, పట్టిగుడిపాడు, పోలసానపల్లి, ఈదులగూడెం తదితర గ్రామాలకు చెందిన వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చెత్తను డంపింగ్‌యార్డులోనే వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్రహీంపట్నంలో వీధి కుక్కల బెడద

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. రోడ్లపై బహిరంగంగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇవి వాహనదారుల వెంట పడటంతో భయంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. జన సంచారం కలిగిన రింగ్ సెంటర్‌లో వీధి కుక్కలు సంచరించడంతో స్థానికులతో పాటు చిరు వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. కొండపల్లి మున్సిపల్ అధికారులు, పాలకవర్గం వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ అది పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీంతో మరలా వీధి కుక్కల బెడద పట్టణంలో ఎక్కువైంది. మండల పరిధిలోని జంతు సంరక్షణ సేవా సంస్థలు సైతం వీటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మున్సిపాల్టీ వారు వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో జనావాసాల మధ్య సంచరిస్తున్న వీధి కుక్కలు

బైక్ రేసింగ్‌లు సహించేది లేదు

ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు హెచ్చరిక

ఇబ్రహీంపట్నం: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై బైక్ రేసింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు యువకులను హెచ్చరించారు. స్థానిక రింగ్ సెంటర్‌లో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో స్పోర్ట్స్ బైక్‌పై రేసింగ్ చేస్తూ 65వ నంబర్ జాతీయ రహదారిపై వస్తున్న యువకులు పోలీసుల కంట పడ్డారు. ట్రాఫిక్ పోలీసులను చూసిన యువకులు పక్కనే ఉన్న పవిత్ర సంగమం రోడ్డులోకి రేసింగ్ స్టైల్లోనే వెళ్లిపోయారు.

ట్రాఫిక్ సిబ్బంది వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఖరీదైన బైకులతో సోషల్ మీడియా లైక్‌ల కోసం ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ట్రాఫిక్ ఎస్ఐ హెచ్చరించారు. వాహన రికార్డులు, ఇన్సూరెన్స్, లైసెన్స్‌లేని వ్యక్తులకు జరిమానా విధించారు. సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ రేసింగ్ చేస్తున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు

వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతక్కి



తిరువూరు: పశు సంవర్ధక శాఖలో పనిచేసే వెటర్నరీ అసిస్టెంట్ల రాష్ట్ర అసోసియేషన్‌కు ఆదివారం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో తిరువూరు మండలం చింతలపాడులో పనిచేసే నూతక్కి రాఘవరావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడ పశు వైద్యశాలలో రాష్ట్ర ఎన్జీఓ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాఘవరావును పశు సంవర్ధక శాఖ సిబ్బంది అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆగిరిపల్లి బ్రాంచి
ఆగిరిపల్లి, ఆగిరిపల్లి మండలం, కృష్ణాజిల్లా, ఏపీ.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆగిరిపల్లి (... ఆగిరిపల్లి) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 సెక్షన్ 13(2)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: శ్రీ ... రామారావు, ... ఆగిరిపల్లి వారు చెల్లించవలసిన బకాయి మొత్తం ది. 30.04.2025 నాటికి రూ.10,39,931.42 పై (...) + నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా తేది. 06-05-2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 ప్రకారము తేది. 05-08-2025న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకొనడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆగిరిపల్లి (...) వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.10,39,931.42 పై (...) వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ... ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు హెచ్చరించడమైనది.

... సదరు చట్టములోని సెక్షన్ 13 (8) ప్రకారం ... తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు
కృష్ణాజిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రీ, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామం, ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ, ఆర్.ఎస్. నెం. 31, ... సరిహద్దులు: తూర్పు: ... పడమర: ... ఉత్తరం: 24 అడుగుల పంచాయతీ రోడ్డు, దక్షిణం: ...

తేది: 05-08-2025
ప్రదేశము: ఆగిరిపల్లి
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా